మేడారం ప్రపంచ చరిత్రలోనే ఒక మైలురాయి

విశ్వంభర, మేడారం : ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయనీ ,నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ ,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అనసూయ పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్ పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ పునర్ నిర్మాణం పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం వచ్చింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర ,పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను మీడియా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూమేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.

పునరుద్ధరణ పనులు చేపట్టే సమయంలో గిరిజన పూజారులతో అనేకసార్లు సమావేశాలు నిర్వహించి పూజారుల సంఘం అభిప్రాయం తీసుకుని పూజారులను ఒప్పించడం జరిగిందని, ఒకే లైన్లో వన దేవతలు ఉండడం వలన భక్తులు దర్శనాలు చేసుకోవడానికి సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పూర్వకాలంలో గిరిజనులకు పసుపుతో ఎంతో బంధం ఉందని, శాస్త్రీయంగా పసుపుతో పలు వ్యాధులను నయం చేసుకునే అవకాశం ఉందని దీనిని వాడకం చేయడం వలన పూర్వం లో ఆదివాసులు ఎలాంటి వ్యాధుల బారిన పడిన పసుపును వాడుకున్నారని తెలిపారు. సమ్మక్క తల్లి గోత్రం బండారి గోత్రమని, తమ ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం ప్రతి పనిని కుడి నుండి ఎడమవైపు నడుస్తుందని, నవగ్రహాలు సైతం కుడి నుండి ఎడమవైపే తిరుగుతున్నాయని వివరించారు. స్వస్తిక్ ఏర్పాటు చేసే విషయంలో సైతం పకృతి సిద్ధాంతాన్ని ఆచరించామని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులు ఒకే వరుస క్రమంలో సులభతరంగా దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జాతర కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుతామని మంత్రి తెలిపారు. చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో ఈసారి సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని భక్తులందరూ విజయవంతనికి కృషి చేయాలని సహకరించాలని కోరారు. ఆదివాసిల సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ ప్రతి నిర్మాణం చేపడుతున్నామని సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. చరిత్రలో సుమారు 250 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడకుండా పనులు చేపట్టేలా ప్రతినిత్యం సమీక్షిస్తున్నామని నిత్యం మంత్రుల బృందం పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తికానున్నాయని. తెలిపారు గతంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సందర్శించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు ఆదివాసీలు ఆలయాన్ని విస్తరించాలని కోరగా అధికారంలోకి రాగానే తప్పకుండా ఆలయాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చి నేడు నిలుపుకుంటున్నారని తెలిపారు.

ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి 251 కోట్లు మంజూరు చేశారని మేడారం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని పనులను వేగవంతం చేస్తున్నారని నిత్యం నిర్మాణం పనులను సమీక్ష చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్ హాయంలో తాత్కాలిక పనుల పేరిట నిధులను ఖర్చు ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం పక్కా పకడ్బందీ వ్యూహంతో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని చెప్పారు. చరిత్రలోనే కనీవిని ఎరుగని రీతిలో ఈ దఫా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని భక్తులంతా సహకరించాలని పేర్కొన్నారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నామని. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుందన్నారు. వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలుంటాయి అని వివరించారు గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం ఉంటుంధని తెలిపారు. వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

శిలలపై ఆదివాసీల సంస్కృతి పెద్దపీట వేస్తున్నాం.. శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా వివరించారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు చెక్కించామని పేర్కొన్నారు. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల బొమ్మలుంటాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 250 మంది శిల్పులు పనిచేశారనీ, స్థపతులు ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ మోతీలాల్ పర్యవేక్షిస్తున్నారనీ చెప్పారు సమ్మక్కసారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ చిత్రాల రూపకల్పనలో సాయం అందించారని పేర్కొన్నారు గద్దెల ప్రాంగణానికి సమీపంలో ఇదివరకు ఉన్న చెట్లను దాదాపు తొలగించకుండానే అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వనదేవతల పూజల్లో విశిష్టత కలిగిన బండారి, మర్రి, వెదురు, బూరుగ, వేప, ఇప్ప, కస్తు వంటి 12 రకాల చెట్లు, 140 రకాల ఆయుర్వేద మొక్కలు నాటనున్నామని పేర్కొన్నారు.

పనుల వేగ పంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష..

మేడారం ఆలయంలో పునర్నిర్మాణ పనులు వేగవంతానికి మంత్రుల బృందం ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నది. పనులను పరిశీలిస్తూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నది. పనుల్లో పూర్తి నాణ్యత పాటించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏది అవసరం పడిన వెంటనే తెప్పిస్తున్నారు. అధికారుల పురమయిస్తూ పనులు వేగవంతానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రతి రోజు పనుల వేగవంతం పై అడిగి తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలో అన్ని పనులు పూర్తీ అవుతాయి.మంత్రుల బృందాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అధికారులకు ఆదేశాలిస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారు. ఈసారి సమ్మక్క సారలమ్మ జాతరను బ్రహ్మాండంగా విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రుల బృందం ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తూ వేగవంతం చేస్తున్నది.

అభివృద్ధి మాట వినిపించడంలేదు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణ రాజకీయాల్లో అభివృద్ధి మాట వినిపించడంలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్నవారు, అధికారం కోసం ఆరాటపడేవారు అసభ్య పదజాలంతో దూషించుకుంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రజాచర్చను వదిలేసి బూతు పురాణం అందుకున్నారని విమర్శించారు. నాయకులు తిట్టుకుంటున్నారంటే వాళ్లు పాలనలో విఫలం అయినట్టేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి గురించి మాటలు లేవని, జవాబుదారీతనం లేదని ఆరోపించారు. భాషపై ఉపన్యాసాలు ఇచ్చే పార్టీలే ఇప్పుడు రాజ్యాంగ వేదికల నుండి అసభ్యకరమైన పదాలను ఉపయోగిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణకు ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతులకు ఆదాయమార్గాలు, పట్టణాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరం అని స్పష్టం చేశారు. కానీ అధికారపార్టీ మరియు ప్రతిపక్షాల మధ్య తిట్ల పురాణం అవసరం లేదన్నారు. ప్రజలు మంచి ప్రభుత్వం కోసం ఓటు వేశారని, కానీ 2014 నుండి గట్టర్ పాలిటిక్స్ యే జరుగుతున్నాయని ఆరోపించారు.

తెలంగాణలో బిసి భారత్ బంద్‌కు పిలుపునిస్తాం..

విశ్వంభర, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిబద్ధత గల లీడర్ అని బీసీ సంక్షేమ సంఘాల నాయకుడు, బీజేపీ రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు బీసీలకు తప్పకుండా న్యాయం చేస్తారనే నమ్మకం తనకు ఉందన్నారు. ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బీసీ సంఘాలను ఏకతాటిపైకి తేవడానికి త్వరలోనే ఓ భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని అన్నారు. ఆ సభకు ప్రధాని నరేంద్ర మోడీని ఆహ్వానించి బీసీలకు న్యాయం చేయాలని కోరుతామని తెలిపారు. ఇక ఏపీలో బీసీల సమస్యలపై జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని.. రాష్ట్రవ్యాప్తంగా బీసీ భారత్ బంద్‌కు పిలుపునిస్తామని అన్నారు.

అసెంబ్లీకి రాబోతున్నా : కేసీఆర్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : పార్టీ ముఖ్య నేతలతో ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్ వేదికగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన సమావేశం ముగిసింది.పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల తదుపరి కార్యాచరణపై నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోంది తెలంగాణకు కాంగ్రెస్ ఎప్పుడూ ద్రోహమే చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్‌కు వేరే పార్టీలకు తెలంగాణపై పట్టింపు లేదని తెలిపారు. తెలంగాణ పట్ల వివక్ష చూపుతున్న కేంద్ర, రాష్ట్ర విధానాల పట్ల పోరాటం చేయాల్సిందే అని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజాక్షేత్రంలో ఈ రెండు పార్టీల విధానాలను ఎండగడుతామని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల్లోకి వెళ్తాం.. ఉద్యమాన్ని నిర్మిస్తామని కీలక ప్రకటన చేశారు. తెలంగాణకు రావాల్సిన నీటి హక్కులను పరిక్షించుకునే బాధ్యత బీఆర్ఎస్‌పైనే ఉంటుందని అన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరిద్దామని చెప్పారు. ఇక ఊరుకునే ప్రసక్తే లేదని.. అసెంబ్లీలోనే ద్రోహాన్ని బట్టబయలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. మరోవైపు.. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ముందు నిర్ణయించిన విధంగా బీఆర్ఎస్ సభలు ఏర్పాటు చేయాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 29న శాసనసభకు కేసీఆర్ హాజరయ్యే అవకాశముందని, అసెంబ్లీ సమావేశాల తర్వాత బీఆర్ఎస్ బహిరంగ సభలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు.

జనవరి 1వ తేదీన కృష్ణా, గోదావరి జలాలపై మంత్రి ఉత్తమ్ పీపీటీ.. హాజరుకానున్న సీఎం

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ బ్యూరో: వచ్చే నెల 1న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాల అంశంపై కాంగ్రెస్ పార్టీ నేతలకు ముఖ్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించనున్నారు. ప్రగతిభవన్ వేదికగా నిర్వహించే ఈ పీపీటీలో రాష్ట్ర జలవిధానంపై ప్రభుత్వ వైఖరి, గత పాలనలో జరిగిన నిర్ణయాలు, ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లపై సమగ్రంగా వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా హాజరుకానున్నారు. ప్రధానంగా అసెంబ్లీలో కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించే లక్ష్యంతో.. గత ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని వివరించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. 2, 3వ తేదీల్లో గోదావరి, కృష్ణా జలాలపై అసెంబ్లీలో ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. అయితే.. అధికారంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సైతం ఈ సబ్జెక్టు మీద అవగాహన ఉండాలనే ఉద్దేశంతో వారికి ఒకరోజు ముందుగానే పీపీటీలో వివరించనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో జలాల విషయంలో జరిగిన రాజీలను అసెంబ్లీలో గట్టిగా ప్రస్తావించేందుకు, పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఒకే వాయిస్‌తో మాట్లాడేందుకు ఈ ప్రజెంటేషన్‌ను కీలకంగా భావిస్తున్నారు.

పీపీటీ ముఖ్య అంశాలు

- **కృష్ణా, గోదావరి నదీ జలాలపై తెలంగాణకు ఉన్న హక్కులు.**
- **ఆంధ్రప్రదేశ్‌తో కొనసాగుతున్న జల వివాదాల తాజా పరిస్థితి.**
- **బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ముందున్న కేసుల స్థితి.**
- **గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణకు జరిగిన నష్టం.**
- **ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు.**
- **కొత్త ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములపై ప్రభుత్వ దృష్టి**

మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పించిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థిక వేత్త స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జూబ్లీ హిల్స్ నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడిగా, నవ భారత శిల్పిగా దేశానికి అపార సేవలు అందించారని పేర్కొన్నారు. నిజాయితీ, దూరదృష్టి, మానవతావాదంతో దేశాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ముఖ్యంగా ఆర్థిక రంగంలో చేపట్టిన సంస్కరణలు దేశ ప్రగతికి బలమైన పునాది వేశాయని తెలిపారు. డా. మన్మోహన్ సింగ్ ఆలోచనలు, విధానాలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

జలాంతర్గామిలో ప్రయాణించనున్న రాష్ట్రపతి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపదీ ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. డిసెంబరు 28న కర్ణాటకలోని కర్వార్ హార్బర్ నుంచి సీ సార్టీ చేయనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఆమె గోవా, ఝార్ఖండ్, కర్ణాటకలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలోనే జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. రెండు నెలల క్రితం కూడా రాష్ట్రపతి ఇలాంటి సాహసమే చేశారు. రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి రఫేల్ లో ప్రయాణించిన సంగతి తెలిసిందే. ఇక, 2023 మే 8న ద్రౌపదీ ముర్ము అస్సాంలోని తేజ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్30 ఎంకేఐ యుద్ధ విమానంలో విహరించారు. ఈ ప్రయాణం చేసిన రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె గుర్తింపు సాధించారు. అంతకుముందు 2009లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ఇదే ఫైటర్‌జెట్‌లో గగనయానం చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా 2006లో పుణె వాయుసేన స్థావరం నుంచి సుఖోయ్30 యుద్ధ విమానంలో విహరించారు.

కొత్త జీవోతో జర్నలిస్టులకు నష్టం లేదు



విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన అక్రెడిటేషన్ మార్గదర్శకాలు వృత్తిపరమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం చేయవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎలాంటి వివక్షత లేకుండా సంక్షేమ చర్యలు అందరికీ వర్తించడంతోపాటు ఇంకా మెరుగైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి యోచిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఉర్దూ జర్నలిస్టులపై అనుసరించిన వివక్షతను, చిన్న పత్రికలపై చూపిన చిన్నచూపును, తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన అంశాల నేపథ్యంలో ఈ కొత్త జీఓలో మార్పులు తెచ్చినట్లు వెల్లడించారు. నూతన జీఓపై కొందరు ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలను వెల్లడిస్తున్నారని తెలిపారు. సంక్షేమ చర్యలు విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని వక్రీకరిస్తున్నారని.. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ ఇవి వర్తిస్తాయని వెల్లడించారు. ఈ విషయాలపై అవసరమైతే వివరణ కోరవచ్చని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమ చర్యలపై సీఎంతోపాటు సమాచార శాఖ మంత్రితో ఎప్పుడైనా మాట్లాడొచ్చని తెలిపారు. కానీ.. అందుకు విరుద్ధంగా రాజకీయ ఎత్తుగడతో కొన్ని శక్తులు ఆందోళన చేయాలని తలపెట్టడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. జర్నలిస్టులు, వారి సమస్యలపై సీఎం నాయకత్వాన ఉన్న ప్రజాప్రభుత్వం సానుకూల పరిష్కారానికి వెళ్తుంది తప్పా, గత ప్రభుత్వం మాదిరిగా వివక్షత చూపే అవకాశమే లేదని తెలిపారు. నూతన జీవోపై పనిగట్టుకొని కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని విశ్వసించరాదని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం అనుమతితోనే యూనియన్ల పునరుద్ధరణ..

- ఆర్టీసీ జేఏసీ నాయకులతో ఎండీ నాగిరెడ్డి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో : టీజీఎస్ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణ అంశం యాజమాన్యం పరిధిలో లేదని, ప్రభుత్వం అనుమతితో యూనియన్ల కార్యకలాపాలను అనుమతిస్తామని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఆర్టీసీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్ శుక్రవారం బస్ భవన్ లో ఎండీని కలిసి వినతిపత్రం సమర్పించారు. 22 డిమాండ్లతో కూడిన అంశాలపై సుదీర్ఘంగా ఎండీతో చర్చించినట్లు తెలిపారు. 2017 వేతన సవరణకు చెందిన అలవెన్సులు పెంచి చెల్లించేందుకు ఎండీ సానుకూలంగా స్పందించారని జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. కారుణ్య నియామకాలను 3 సంవత్సరాల పాటు కన్సాలిడేటెడ్ పే కింద పని చేసే విధానాన్ని 2 సంవత్సరాలకు మారుస్తామని, 2021 వేతన సవరణను వీలైనంత త్వరలో అమలు చేయడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వీలైనంత త్వరగా చెల్లిస్తామని, మహాలక్ష్మి పథకంలో ప్రయాణిస్తున్న మహిళలకు స్మార్ట్ కార్డు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్మికులపై పనిభారాలు తగ్గిస్తామని, జనం లేని రూట్లలో కిలోమీటర్లను తగ్గిస్తామని, కారుణ్య నియామకాల వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచడానికి బోర్డు అనుమతి కోరుతామని తెలిపారన్నారు. తార్నాక హాస్పిటల్ లో రోగులతో పాటు వచ్చే అటెండెంట్స్ కి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, త్వరలో విశ్రాంతి భవనం నిర్మించి అందులో డైనింగ్ హాల్ ను ఏర్పాటు చేస్తామని ఎండీ హామీ ఇచ్చారన్నారు. ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ ప్రైవేటు వాహనాల రవాణాను అరికట్టేందుకు తగు చర్యలు చేపడతామని ఎండీ తెలిపారన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరించటానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చినందుకు ఎండీకి వారు జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. జేఏసీ నేతలు ఎన్.కమలాకర్ గౌడ్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, ఎం.ఎ.మజీద్, జి.రాములు, జి.రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి బాధ్యతల స్వీకరణ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ రాష్ట్ర శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు శాసనసభ కార్యదర్శిగా సేవలందించిన వి. నరసింహాచార్యులు నుండి ఆయన అసెంబ్లీలోని కార్యదర్శి ఛాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యదర్శి తిరుపతి, శాసన మండలి కార్యదర్శి వి. నరసింహాచార్యులు కలిసి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ నూతన కార్యదర్శి తిరుపతికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో ఆయన విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం, ఇప్పటివరకు అసెంబ్లీ కార్యదర్శిగా ఉన్న వి. నరసింహాచార్యులు ఇకపై శాసన మండలి కార్యదర్శిగా తన సేవలను కొనసాగించనున్నారు.

నూతన సంవత్సరం వేళ 'జీరో డ్రగ్స్' లక్ష్యం

విశ్వంభర, హైదరాబాద్ : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నగరంలో డ్రగ్స్ కట్టడిపై హైదరాబాదు నగర పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. 'జీరో డ్రగ్స్' విధానమే లక్ష్యంగా కఠిన చర్యలు చేపట్టాలని సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం హెచ్‌న్యూ, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, వెస్ట్ జోన్, సీసీఎస్ తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించి, పలు దిశానిర్దేశాలు చేశారు.నూతన సంవత్సర వేడుకల వేళ డ్రగ్స్ వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నగరంలోని పబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఈవెంట్లు జరిగే ప్రదేశాలతో పాటు సర్వీస్ అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీలపైనా ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారి కదలికలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, డ్రగ్స్ సరఫరాదారులు, వినియోగదారుల జాబితా సిద్ధం చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.వేడుకల సమయపాలనపై హెచ్చరిస్తూ పబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు రాత్రి 1 గంటకే మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత సంస్థల లైసెన్సులను రద్దు చేస్తామని తేల్చిచెప్పారు.మైత్రీవనం, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్, కేబీఆర్ పార్క్ తదితర జనసమర్ధ ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, బ్యారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిఘా పేరుతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలీసులంతా సమన్వయంతో పనిచేసి నగర పోలీసు ప్రతిష్ఠను మరింత పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు ఎన్. శ్వేత, కె. అపూర్వ రావు, రక్షిత కృష్ణమూర్తి, సిహెచ్. రూపేష్, చింతమనేని శ్రీనివాస్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, టాస్క్ ఫోర్స్ అదనపు డీసీపీలు అందే శ్రీనివాస రావు, ఇక్బాల్ సిద్దిఖీ తదితర అధికారులు పాల్గొన్నారు.